క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మోహన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని.. ప్రజలు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి సాయం

ఖానాపూర్: ట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన జెట్టి ధర్మయ్య అనే ట్రాక్టర్ డ్రైవర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఒడ్డెపల్లి కృష్ణంరాజు సహకారంతో ఫౌండేషన్ సభ్యులు బుధవారం బాధిత కుటుంబీకులను కలిసి రూ.5వేల విలువైన మూడు నెలలకు సరి పడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు దూడం శ్రీనివాస్, పంబాల భీమన్న, సంగర్తి రాజన్న, మడిగెల అనిల్, ప్రకాశ్‌గౌడ్, భీమేశ్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నాయకులు కోరారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ బి.రాజేశ్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. గట్టు మైసమ్మ ఆలయం వద్ద భక్తులకు ఇబ్బంది లేకుండా రోడ్డును చదును చేయించాలని, కిసాన్‌గల్లి, నేతాజీనగర్, పురాణబజార్‌లోని స్వాధ్యాయ కేంద్రాల పరిసరాల్లో, ఇతర కాలనీల్లో డ్రైనేజీలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గాలి రాజన్న, వెంకటేశ్, దిలీప్, ప్రవీణ్, పవన్, తదితరులున్నారు.

25వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న నరేశ్

నిర్మల్‌ఖైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని నాయుడువాడ కాలనీకి చెందిన గొండ నరేశ్ తన కూతురు గొండ సహస్ర జన్మదినం పురస్కరించుకొని బుధవారం జిల్లా జనరల్ ఆస్పత్రిలో రక్తదానం చేశారు. ఇప్పటివరకు నరేశ్ 25సార్లు రక్తదానం చేశారు. ఈసందర్భంగా ఆసుపత్రి సిబ్బంది ఆయనను అభినందించి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి రాకేశ్, సామాజిక కార్యకర్త నిగులపు సంజీవ్, సొప్పరి రమేశ్ ఉన్నారు.

40 మంది రక్తదానం

తానూరు: మండలకేంద్రంలోని ఓంకార్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన 40 మందికి పండ్లు అందించారు. సేకరించిన రక్తం ప్యాకెట్లను భైంసాలోని జీవన్‌దాన్ కేంద్రానికి అందించనున్నట్లు డాక్టర్ చంద్రకాంత్ జోగ్‌దాండ్ పేర్కొన్నారు. ఎస్సై షేక్ జుబేర్, తాడేవార్ విఠల్, మాధవ్‌పటేల్, పుండలిక్, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు అందజేత



పరికరాలు అందిస్తున్న సభ్యులు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు వరల్డ్ విజన్ అనే స్వచ్ఛంద సంస్థ రూ.40 వేల విలువైన క్రీడా పరికరాలను సమకూర్చగా ఎంఈవో అశోక్‌వర్మ అందజేశారు. దీంతో సంస్థ సభ్యులకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. రాచాపూర్ గ్రామంలో ఓ పేద కుటుంబానికి రూ.లక్షతో చిన్న ఇంటిని నిర్మించి ఇచ్చారు. ఇందులో సంస్థ సభ్యులు మేనేజర్ బ్రహ్మన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

భైంసాటౌన్: విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా రాణించాలని మోటివేషనల్ స్పీకర్ వాడేకర్ లక్ష్మణ్ అన్నారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్' పర్యటన

ఖానాపూర్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఉత్తమ గ్రామాలను ఎంపిక చేసేందుకు బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం సభ్యురాలు కల్పన మండలంలోని పాతఎల్లాపూర్ గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ, ఇంకుడుగుంతలు, అంగన్‌వాడీ కేంద్రం పాఠశాల, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమెను సన్మానించారు. ఎంపీడీవో జె.సునీత, ఎంపీవో రత్నాకర్‌రావు తదితరులు ఉన్నారు.

నారుమడులకు నీరేది..

- వర్షాల్లేక నిండని స్వర్ణ ప్రాజెక్టు
- వరినాట్లు ఆలస్యమవుతాయని ఆయకట్టు రైతుల ఆందోళన
- 1175 అడుగులకు చేరిన నీటిమట్టం
- సాగు నీరు విడుదల చేయాలని వేడుకోలు



స్వర్ణ ప్రాజెక్టు

సారంగాపూర్: మండలంలోని స్వర్ణ ఆయకట్టు రైతులు ఈఏడాది ఖరీఫ్ సాగుపై ఆశలు వదులుకునే పరిస్థితి ఏర్పడింది. గతేడాది ఈ సమయంలో ప్రాజెక్టులో నీరు ఉండటంతో వరి నారుమడులకు వదిలారు. కానీ ఈసారి సరిపడా వర్షాలు కురువక పోవడంతో ప్రాజెక్టులోకి నీరు చేరలేదు. దీంతో ఈ ఏడాది వరినాట్లకు ఆలస్యం అవుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1183 అడుగులు(1.484 టీఎంసీలు) కాగా ప్రాజెక్టు ఆయకట్టు విస్తీర్ణం 8,945 ఎకరాలు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1175.2 అడుగులు(0.410 టీఎంసీలు) మాత్రమే ఉండటంతో వరి నారుమడులకు నీరు వదలలేని పరిస్థితి ఉందని అధికారులు అంటున్నారు.

ప్రాజెక్టు కింద మూడు కాల్వలు..

ప్రాజెక్టు మూడు ప్రధాన కాలువల కింద ఆయకట్టు భూములకు నారుమడులు పోసుకోకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. నారుమడులు పోసుకున్న చోట వర్షాల్లేక నారు ఎండిపోయే దుస్థితి నెలకొనగా.. వరుణుడి రాక కోసం ఎదురు చూస్తున్నారు. సమీపంలోని బోరుబావుల యజమానులకు డబ్బులు చెల్లించి నారుమడులను రక్షించుకునేందుకు నీటిని అందిస్తున్నారు. మరికొందరు బోరుబావుల సహకారంతో బురద నేల చేసి నారుమడులు పోసుకుంటున్నారు. గత నాలుగైదు రోజులుగా వేసవి మాదిరి ఎండలు మండిపోతుండటంతో వరి మొలకలతోపాటు పత్తి, సోయా పంటలకు నష్టం జరిగే పరిస్థితి నెలకొంది.



ప్రాజెక్టు మధ్య కాలువలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డి



సారంగపూర్‌లో బోరుబావుల సహకారంతో నారు పోసుకున్న రైతులు

డిస్ట్రిబ్యూటరీలు అధ్వానం..

స్వర్ణ ప్రాజెక్టు వర్షాలకు నిండినా.. మూడు ప్రధాన కాలువలతో పాటు డిస్ట్రిబ్యూటరీల కాలువల్లో పూడిక, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో చివరి వరకు నీరందేలా లేదని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు నిండినా.. కాలువలతోపాటు ప్రాజెక్టులో పూడిక పేరుకు పోయి త్వరగా ఖాళీ అయ్యే దుస్థితి ఉందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం నారుమడులకు సరిపడా నీటిని విడుదల చేస్తే నారుమడులు పోసుకుంటామని రైతులు అంటున్నారు.

సమయం మించిపోతోంది



వరిసాగుకు నార్లు పోసుకునే సమయం మించిపోతుంది. సకాలంలో వర్షాలు కురిస్తే నారుమడులు పెరిగి మరో వారంలో నాట్లకు సిద్ధమయ్యేవాళ్లం. కానీ ఈసారి వర్షాలు ఆలస్యమవుతున్నాయి. ప్రాజెక్టులో ఉన్న కొద్దిపాటి నీరైనా నారుమడులకు విడుదల చేయాలి.

– ఏనుగు నారాయణరెడ్డి, రైతు, బోరిగాం

పిచ్చిమొక్కలు తొలగించాలి



స్వర్ణ ప్రాజెక్టు కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. వేసవిలోనే వీటిని తొలగిస్తే బాగుండేది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో పిచ్చిమొక్కల తొలగింపునకు చర్యలు చేపట్టాలి. లేదంటే చివరి వరకు నీరందడం కష్టమే.

– రాథోడ్ మనోజ్, రైతు, కౌట్ల(బి)

నీరు విడుదల చేస్తాం..

నారుమడులకు సరిపడే నీరు ప్రాజెక్టులో ఉంది. నీటిని విడుదల చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. కాలువల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అతి త్వరలోనే నీటిని విడుదల చేస్తాం.

– మధుపాల్, ఏఈ, స్వర్ణ ప్రాజెక్టు

ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలి



మొక్క నాటుతున్న ఏఎస్పీ రాజేశ్‌మీనా, సీఐ గోవర్ధన్‌రెడ్డి

సోన్: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలని నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా పేర్కొన్నారు. బుధవారం సోన్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరాలకు సంబంధించిన రికార్డులు, సర్వీసు బుక్‌లను పరిశీలించారు. పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. వాహనాల తనిఖీలు, పెట్రోలింగ్‌ను నిరంతరం కొనసాగించాలని పేర్కొన్నారు. స్టేషన్ పరిసరాలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అంతకుముందు ఏఎస్పీకి సీఐ, ఎస్సైలు స్వాగతం పలికారు. ఇందులో సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్సైలు గోపి, శ్రీనివాస్, అశోక్, సిబ్బంది ఉన్నారు.

'కవిత అనుచరులను అరెస్ట్ చేయాలి'

ఖానాపూర్: బీసీల గొంతుక ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై దాడి చేసిన ఎమ్మెల్సీ కవిత అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శులు పీటర్, సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ నేతపై దాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆందోళన



సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని గ్రామస్తులు బుధవారం సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. తరచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. దీనిపై ఏఈ మహేశ్‌ను 'సాక్షి' ఫోన్‌లో వివరణ కోరగా గ్రామస్తులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'ఉపాధి' సిబ్బందికి వేతనాలు అందించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

తానూరు: తమకు పెండింగ్ వేతనాలు అందించాలని ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న సిబ్బంది బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నసీరొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీవో, టీఏలు, ఎఫ్ఏల వేతనాలు నాలుగు నెలలుగా అందకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వేతనాలు అందించేలా చూడాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఈజీఎస్ ఏపీవో శివలింగయ్య, టీఏలు గంగాధర్, మహేందర్, రమణగౌడ్, ప్రసాద్ ఆయా గ్రామాల ఎఫ్ఏలు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ప్రారంభిస్తాం

సాక్షి ఎఫెక్ట్..



ప్రజలతో మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం పండరి

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్, రాజురా, బావాపూర్(ఆర్), చందునాయక్ తండా గ్రామాల్లో బుధవారం ఆర్టీసీ నిర్మల్ డీఎం కె.పండరి పర్యటించారు. ఆర్టీసీ బస్సులేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 15న సాక్షిలో 'రోడ్లున్నా.. బస్సు సౌకర్యం సున్నా'శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్యటించినట్లు గ్రామ నాయకులు తెలిపారు. గ్రామాల్లో ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని.. ఇందులో భాగంగా రూట్ సర్వే చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు సైతం ఆర్టీసీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు నిమ్యానాయక్, నారాయణరెడ్డి, చిన్నం రవీందర్, శెట్టి సంజీవ్, డా. శ్రీనివాస్, దశరథ్‌రెడ్డి, గుగ్లావత్ బిక్‌సింగ్, విలాస్, లాలానాయక్, శంకర్, తుకారం ఉన్నారు.

గంగమ్మ తల్లికి బోనాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

కడెం: మండలకేంద్రంలో బుధవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్ల నడుమ కడెం ప్రాజెక్ట్ వద్దకు వెళ్లి గంగమ్మతల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సంక్షిప్త వార్తలు

దోమల నివారణకు ఫాగింగ్

కుంటాల: వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. బుధవారం కుంటాలలో కార్యదర్శి రాజబాపు ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్ల వద్ద సిబ్బందిచే ప్రత్యేక మిషన్ ద్వారా ఫాగింగ్ చేయించారు.

తప్పనిసరిగా బీమా చేసుకోవాలి

బాసర: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రమాద బీమా చేసుకోవాలని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ రామచంద్రరావు తెలిపారు. మండలకేంద్రానికి చెందిన గైని లక్ష్మికి స్థానిక ఎస్‌బీఐ శాఖలో ఖాతా ఉండడంతో జనరల్ ఇన్సూరెన్స్ పాలసీకి రూ.వెయ్యి ప్రీమియం చెల్లించింది. గతేడాది రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందింది. ఆమె పేరిట మంజూరైన రూ.20లక్షల చెక్కును నామినీగా ఉన్న గైని శైలజకు అందించారు. చీఫ్ మేనేజర్ కంభం సురేశ్ బాసర మేనేజర్ అశోక్‌కుమార్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీపీఈ కిట్లు ధరించాలి

నిర్మల్‌టౌన్: పీపీఈ కిట్లు ధరించి పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నమస్తే డే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు పీపీ కిట్లతో కలిగే ప్రయోజనాలను వివరించారు. పారిశుద్ధ్య కార్మికులు, సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేసే సిబ్బంది విధుల్లో తప్పనిసరిగా పీపీఈ కిట్లు ధరించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాసు, ప్రవీణ్‌కుమార్, జవాన్లు రమేశ్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ఖానాపూర్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో సంధ్యారాణి అన్నారు. బుధవారం మండలంలోని తర్లపాడ్, సత్తనపల్లి ప్రాథమిక పాఠశాలలతోపాటు సత్తనపల్లి జెడ్పీహెచ్ఎస్, పాతఎల్లాపూర్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, గోసంపల్లె ప్రాథమికోన్నత, దిలావార్‌పూర్, రాంరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలు, పట్టణంలోని బస్టాండ్ స్కూల్, అంబేద్కర్‌నగర్ స్కూళ్లను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎంలు వాల్గొట్ శ్రీనివాస్, మురళి, భీమలింగు, తదితరులు ఉన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు

భైంసాటౌన్: బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్సై నవనీత్ రెడ్డి అన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా బుధవారం కార్మికశాఖ, బాలల హక్కుల పరిరక్షణ అధికారులతో కలిసి పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓ మెకానిక్ దుకాణంలో పనిచేస్తున్న బాల కార్మికుడిని అదుపులోకి తీసుకున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించారు. సదరు దుకాణ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విచారణకు ఆదేశించిన కలెక్టర్

సాక్షి ఎఫెక్ట్..

కుభీర్: మండలకేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మెనూ పాటించకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈనెల 16న సాక్షిలో మెనూ పాటించడం లేదు శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ అభిలాష అభినవ్ స్పందించారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డీటీడీవో అంబాజీ నాయక్‌కు ఉత్తర్వులు జారీ చేశారు.

బాధితులకు పరామర్శ



సిర్పెల్లిలో పరామర్శిస్తున్న విఠల్‌రెడ్డి

కుభీర్: మండలంలోని సిర్పెల్లి తండాలో లక్ష్మబాయి(95) ఇటీవల మృతి చెందగా బుధవారం బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి పరామర్శించారు. కుభీర్‌లో అడవిపంది దాడిలో గాయపడిన సేరె భూమన్నను పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కల్యాణ్, నాయకులు రాజాసింగ్, నాగలింగం, విజయ్, హీరా, రతన్ పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

దస్తురాబాద్: మండలకేంద్రానికి చెందిన కొడిమెల అనూష(26) అనే వివాహిత మిస్సింగ్ కాగా బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఆమెకు ఆరేళ్ల కిందట దస్తురాబాద్‌కు చెందిన కొడిమెల సురేశ్‌తో వివాహం జరగగా భర్త విదేశాల్లో ఉంటున్నాడు. మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె పినతల్లి మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

భైంసాటౌన్: విద్యార్థులు పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని అర్బన్ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జి వైద్యురాలు ఫిర్దోస్ జబీన్ అన్నారు. బుధవారం పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహంలో వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. హెచ్ఈవో కలీమోద్దీన్, హెల్త్ అసిస్టెంట్లు నరేశ్, శైలజ, ఆశా నుశత్, సిబ్బంది ఉన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

తానూరు: చెత్తను బుట్టల్లో వేసి పంచాయతీ సిబ్బందికి అందించాలని.. రోడ్లపై చెత్త పడేస్తే జరిమానా విధిస్తామని ఎంపీడీవో నసీరొద్దీన్ హెచ్చరించారు. బుధవారం మండలకేంద్రంలోని హోటళ్లు, కిరాణ దుకాణాలను తనిఖీ చేశారు. పలువురికి జరిమానా విధించారు. కార్యదర్శి జలంసింగ్, సిబ్బంది ఉన్నారు.

మోదుగ విస్తరాకులతో లాభాలు



విస్తరాకులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సోన్: మోదుగ విస్తరాకులతో ఆరోగ్య లాభాలుంటాయని మండలంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలో ప్రాజెక్టులో భాగంగా మోదుగ ఆకులతో తయారు చేసిన విస్తరాకులను విద్యార్థులు ప్రదర్శించారు. ఈసందర్భంగా హెచ్ఎం రాజులదేవి రమేశ్‌బాబు మాట్లాడుతూ పర్యావరణానికి మేలు చేసే పచ్చని విస్తరాకుల్లో భోజనం చేయడం ద్వారా అనేక వ్యాధులు తగ్గుముఖం పడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంగమ్మ, రాధ, మౌనిక, రాణి తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు వేడుకలు



నిర్మల్‌టౌన్ : వేడుకలో పాల్గొన్న విద్యార్థులు



సారంగపూర్: చించోలి(బి) సమీపంలో..

నిర్మల్‌టౌన్: ఆషాఢమాసం సందర్భంగా జిల్లాకేంద్రంలోని మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో బుధవారం గోరింటాకు పండుగ ఉత్సవాలు నిర్వహించారు. హెచ్ఎం సిద్ధ పద్మ, ఉపాధ్యాయులు విద్యార్థులకు గోరింటాకు పెట్టారు. రాజేందర్, చట్ల శ్రీనివాస్, సురేందర్, శ్రీనివాస్, మసియుద్దీన్, ఆశ కిరణ్ , విద్యారాణి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని వైద్యఆరోగ్యశాఖలో పనిచేసే మహిళా ఉద్యోగులు గోరింటాకు సంబురాల్లో పాల్గొన్నారు. విధులు ముగిసిన తర్వాత చించోలి(బి) గ్రామ సమీపంలో మామిడి తోటలో గోరింటాకు వేడుకలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి అబ్దుల్ జవాద్, పర్యవేక్షకులు కృష్ణమోహన్ గౌడ్, ఉషా రాణి, ప్రేమ్, శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం హెచ్ఎం వాల్గొట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెహందీ వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయ బృందం విద్యార్థినుల చేతులకు మెహందీ పెట్టి సంబరాల్లో పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న గజేందర్ యాదవ్

నిర్మల్‌టౌన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం కల్పించాలని నవ సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అప్క గజేందర్ యాదవ్ అన్నారు. బుధవారం నిర్మల్ ప్రెస్‌క్లబ్ భవన్‌లో బీసీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ తీసుకొచ్చి.. బీసీలకు రావాల్సిన ఉద్యోగాలను ఓసీలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. అనంతరం నవ సంఘర్షణ సమితి పార్టీ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా షేక్ ఫిరోజ్, ప్రధాన కార్యదర్శిగా నవీన్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సయ్యద్ మక్బూల్‌ను ఎన్నుకున్నారు. వారికి నియామక పత్రాలను అందించారు.

కుంసరలో గ్రామస్తుల గస్తీ

- వరుస దొంగతనాలతో అప్రమత్తం



రాత్రి వేళ గస్తీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామంలో చోటు చేసుకుంటున్న వరుస దొంగతనాలతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల ఒకేరోజు నాలుగు ఇళ్లలో దొంగతనాలు చోటు చేసుకోవడంతో గ్రామస్తులు అప్రమత్తమయ్యారు. దొంగతనాలను అరికట్టేందుకు ముందు జాగ్రత్తగా గ్రామస్తులే వంతుల వారీగా రోజుకు కొందరు చొప్పున గస్తీ నిర్వహిస్తున్నారు. అపరిచితులు కనిపిస్తే పట్టుకుని విచారిస్తున్నారు. మంగళవారం రాత్రి ఇద్దరు అపరిచితులను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు గ్రామస్తులు తెలిపారు. గస్తీలో యువకులు, పెద్దలు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. యువకులు కర్రలు, బ్యాటరీల సాయంతో రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు వరకు గస్తీ నిర్వహిస్తున్నట్లు వివరించారు.

'అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం'

తానూరు: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావ్ పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని వడ్‌గాం, దౌలతాబాద్, ఝరి(బి) గ్రామాల్లో పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. పనులు సత్వరం పూర్తి చేస్తే సకాలంలో బిల్లులు అందించేలా చూస్తామన్నారు. ఈసందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో పలువురు మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ నాయకులు శంకర్ చంద్రె, పార్టీ మండలాధ్యక్షుడు పుండలిక్, మాజీ సర్పంచ్ మాధవ్‌రావ్ పటేల్, చంద్రకాంత్ యాదవ్, గోవింద్‌రావ్ పటేల్, మధుపటేల్, సంజయ్ తదితరులు ఉన్నారు.